క్లుప్తంగా

నేడు బ్రహ్మంగారి కల్యాణం

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాన ప్రబోధ కర్త పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవింద మాంబల కళ్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించనున్నారు. కళ్యాణం తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. గురువారం ఉదయం సుప్రభాతంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాత్రి ఎనిమిది గంటలకు కళ్యాణం నిర్వహిస్తారు. అనంతరం హరికథ, 11 గంటలకు నరసందిని ఉత్సవం, జాగరణ ఉంటాయి.

నేడు ఊటుకూరులో మహాశివరాత్రి వేడుకలు

కడప వైఎస్సార్ సర్కిల్ : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం నగర శివార్లలోని 45వ డివిజన్ ఊటుకూరులో శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆవరణంలోని శివాలయంలో వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మెన్ గోసుల సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, 10 గంటలకు శివపార్వతుల కళ్యాణం, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. రాత్రి 7 గంటల నుంచి శివపార్వతుల ఊరేగింపు ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు



గంధం కలశాన్ని తీసుకొస్తున్న పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా మహమ్మద్ హుసేనీ

కడప కల్చరల్ : స్థానిక రవీంద్రనగర్‌లోని అస్తానె షహమీరియా దర్గా ఉరుసు ఉత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా మహమ్మద్ హుసేనీ బాష షహమీరి సాహెబ్ ఆధ్వర్యంలో తొలుత గంధం కలశాన్ని ఫకీర్ల మేళతాళాలతో దర్గా వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం దర్గాలో ప్రధాన గురువుల మజార్ల వద్ద గంధం సమర్పించి ఫాతెహా నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నైపుణ్యం వెలికితీయాలి



మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప కల్చరల్ : విద్యార్థులను మార్కుల యంత్రాలుగా చూడవద్దని, వారిలోని సహజ నైపుణ్యాలను చదువుతోపాటు వెలికి తీసే పద్ధతులను అనుసరించాలని జిల్లా సర్వశిక్ష ప్రాజెక్టు పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక రామకృష్ణ మిషన్‌లోని వివేకానంద విద్యానికేతన్ హైస్కూలు 14వ వార్షికోత్సవం సందర్భంగా మిషన్ కార్యదర్శి స్వామి అనుపమానందజీ మహరాజ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అంబవరం ప్రభాకర్‌రెడ్డి, స్వామి అనుపమానందజీ మహరాజ్ స్ఫూర్తిదాయక సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే దిక్సూచి

సచివాలయాల ప్రారంభోత్సవాల్లో ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి



చాగలేరులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల : రాష్ట్రంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ దేశానికే దిక్సూచిగా నిలుస్తోందని కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని మబ్బుచింతల పల్లె, పెద్దజూటూరు, చాగలేరు, నల్లచెరువుపల్లె గ్రామాల్లో రూ.22.90 కోట్లతో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, మొగమూరు వాగుపై వంతెన, ఏపీ టూరిజం కళ్యాణ మండపం, జగనన్న కాలనీలను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. గ్రామ వాలంటీర్ల వ్యవస్థను అమలు చేసి దేశానికే జగనన్న ఆదర్శంగా నిలిచారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు మండల కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంట నష్టపోతే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. నల్లచెరువుపల్లె సమీపాన మొగమూరు వాగుకు వరదలు వస్తే రాకపోకలు స్తంభించి ప్రజలు ఇబ్బందులు పడేవారని, రూ.15 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మించి ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. అంతకుముందు మబ్బుచింతలపల్లె లో జగనన్న కాలనీని ప్రారంభించి 23 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎంపీ పంపిణీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ అనిల్ కుమార్‌రెడ్డి, మండల ఇన్‌ఛార్జ్ నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రజా ప్రతినిధులు శివాంజలి, లక్ష్మీదేవి, రామలక్ష్మమ్మ, అర్జున్, చెన్నారెడ్డి, రంగనాథం, రామాంజనేయ రెడ్డి, పీ.రవిచంద్రారెడ్డి, నాయకులు గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో ఎమర్జెన్సీ మాక్ డ్రిల్

ఆయిల్ లీక్ ఘటనతో అప్రమత్తమైన కార్మికులు



గాయపడిన వర్కర్‌ను స్ట్రెచ్చర్‌లో తీసుకెలుతున్న సిబ్బంది

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీపంలోని హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లోని ఎమర్జెన్సీ–1లోని పెట్రోల్ ట్యాంకర్‌లో గురువారం ఆయిల్ తీస్తుండగా లోపల రూఫ్ తిరగబడి ఆయిల్ లీక్ అయింది. మంటలు చెలరేగడంతో అక్కడ వర్కర్ ఫైర్ అని గట్టిగా అరిచారు. హెచ్‌పీసీఎల్ సిబ్బంది సైరన్ మ్రోగించారు. సిబ్బంది అప్రమత్తమై ఆటోమెటిక్ పరికరాలతో ఆ మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అదుపులోకి రాకపోవడంతో ఐటీసీ, ఏజీపి, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది సహకారంతో పోమ్‌తో వాటర్‌తో మంటలను అదుపుచేశారు. పది మంది వర్కర్లకు ప్రమాదం జరగడంతో వారిని స్ట్రెచ్చర్‌పై మెడికల్ క్యాంపు వద్దకు తీసుకొచ్చారు. వైద్యుడు డాక్టర్ శివకుమార్ పరీక్షించి ఆరుగురిని రిమ్స్ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఇదంతా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మాక్‌డ్రిల్. అధికారులు కార్మికుల అప్రమత్తతను పరీక్షించారని, అందరూ స్పందించడం సంతృప్తికరంగా ఉందని కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ క్రిష్ణమూర్తి తెలిపారు. సిబ్బంది అప్రమత్తతపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అనూరాధ(ఏపీఎస్‌డీఎంఏ), హెచ్‌పీసీఎల్ డిపో చీఫ్ రీజనల్ మేనేజర్ మూల నాగసతీష్, డిపో మేనేజర్ బి.మన్మథరావు, అధికారులు ధర్మారావు, వై. ప్రసాద్, ఓబయ్య, సునీల్‌కుమార్‌పాండే, గోపాలక్రిష్ణ, వై.వెంకటేశ్వర్లు, ఏజీపీ రాజీవ్‌రాజన్, ధర్మారావు, రామచంద్ర, బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యతోనే వివక్ష లేని సమాజం

మహిళా దినోత్సవ వేడుకల్లో వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : ప్రతి బాలిక ఉన్నత విద్యావంతురాలు కావాలని, తద్వారా వివక్ష లేని సమాజాన్ని సంపూర్ణంగా చూడవచ్చని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూలోని సురభి సమావేశ మందిరంలో గురువారం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ మహిళల ప్రగతి ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎస్‌కేయూ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య పి. కుసుమకుమారి మాట్లాడుతూ మహిళలు వారి హక్కును సాధించి తీసుకోవాలన్నారు. మహిళల అభ్యుదయం కోసం రాజా రామ్మోహన్ రాయ్, వీరేశలింగం వంటి సంఘసంస్కర్తలు కృషి చేశారని తెలిపారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విశ్వవిద్యాలయాల పాలకమండలిలో 50 శాతం మందిని తీసుకున్నారని తెలిపారు. వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ మహిళలు ప్రవేశించని రంగం లేదని, ప్రతి రంగంలోనూ మహిళల భాగస్వామ్యం ఉందని స్పష్టం చేశారు. పాలకమండలి సభ్యులు ఆచార్య చంద్రమతి శంకర్ మాట్లాడుతూ ఉన్నత స్థలాల్లో నిలిచేందుకు మహిళలు ప్రయత్నించాలన్నారు. వైవీయూ మహిళా సెల్ సమన్వయకర్త ఆచార్య పి. రమాదేవి మాట్లాడుతూ మహిళా దినోత్సవం వెనుక ఉన్న చరిత్రను సంక్షిప్తంగా వివరించారు. సమానం అనేది ఇంటి నుంచే అలవాటు కావాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.కాత్యాయని, డా.ప్రమీల మార్గరేట్, డా.ఎల్.దాక్షాయణి, కె.వేణి సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

చోరీ కేసులతో ఇద్దరు అరెస్టు

కొండాపురం : ముంపు గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు చోరీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాళ్ల ప్రొద్దుటూరు ఎస్‌ఐ చంద్రశేఖర్ గురువారం తెలిపారు ఎస్‌ఐ వివరాల మేరకు.. ముంపు గ్రామాలకు కేటాయించిన రూ.1.10 లక్షల విలువ గల విద్యుత్తు స్తంభాలను అనుమతి లేకుండా తరలిస్తున్న దత్తాపురం గ్రామానికి చెందిన మోహన్, అనిల్‌లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ధాన్యం తీసుకెళ్లారని ఫిర్యాదు



ధాన్యం చోరీ చేస్తున్న మహిళలను పట్టుకున్న రైతులు

ఎర్రగుంట్ల : మండలంలోని పోట్లదుర్తి గ్రామ పొలాల్లో ధాన్యం దొంగిలిస్తున్న తొమ్మిది మంది మహిళలను రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. రాత్రి సమయాల్లో కొందరు మహిళలు కొన్ని రోజులుగా పొలాల్లో నిల్వ ఉంచిన ధాన్యం చోరీ చేస్తున్నారని రైతులు తెలిపారు. గురువారం రాత్రి కాపలా ఉండి తొమ్మిది మందిని పట్టుకున్నామన్నారు. యర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య విచారణ చేపట్టారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

ఎర్రగుంట్ల : పట్టణంలోని మహేశ్వర నగర్ కాలనీలో నివాసముండే నాగసుబ్బరాయుడు కుమార్తె సుప్రియ (23) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య తెలిపారు. సీఐ వివరాల మేరకు.. యర్రగుంట్ల పట్టణానికి చెందిన నాగసుబ్బరాయుడుకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో రెండో కుమార్తె సుప్రియ తిరుపతి లోని పద్మావతి యూనివర్సిటీలో పీజీ కోర్సు చదివింది. అయితే ఇటీవల పెళ్లి సంబంధాలు చూస్తుండగా, అది ఇష్టం లేకపోవడంతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం, నిందితుడిని చూపుతున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో అధికారులు

వాల్మీకిపురం : కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న యువకుడిని అరెస్టు చేసినట్లు వాల్మీకిపురం సీఐ పులిశేఖర్ తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తున్న జయదేవ్ వద్ద సంచిలో 180 ఎంఎల్ 8 టెట్రా ప్యాకెట్లు, 500 ఎంఎల్ 4 టిన్ బీర్ల కర్ణాటక మద్యం పట్టుబడడంతో సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ ఎక్కడైనా కర్ణాటక మద్యం అక్రమ రవాణా, నాటుసారా తయారీ, విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది దస్తగిరి, అబ్దుల్లా, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : పాండిచ్చేరి మద్యం విక్రయిస్తున్న శ్రీనివాసరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డిలను అరెస్ట్ చేసినట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఎర్రగుంట్ల రోడ్డులోని వాసవీ సర్కిల్ వద్ద మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్‌ఐ కిశోర్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఇరువురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద రూ.60 వేల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.పాండిచ్చేరి రాష్ట్రం నుంచి ఇక్కడికి అక్రమంగా మద్యం తెచ్చుకొని ప్రొద్దుటూరుతోపాటు జమ్మలమడుగు తదితర ప్రాంతాల్లో అధిక రేట్లకు విక్రయించేవారన్నారు. స్టేషన్ పరిధిలో అక్రమ మద్యంతో పాటు ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. మట్కా జూదం, పేకాట, క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్‌పెక్టర్ హెచ్చరించారు.

ఓట్ల కోసమే టీడీపీ సానుభూతి

ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న సునీల్, ఇండిపెండెంట్ పాస్టర్లు

కడప కార్పొరేషన్ : ఓట్ల కోసమే టీడీపీ నాయకులు క్రిష్టియన్ మైనార్టీలపై సానుభూతి చూపుతున్నారని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో కడప ఇండిపెండెంట్ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఇటీవల క్రిష్టియన్ మైనార్టీలతో సమావేశం నిర్వహించి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా వర్గాలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పడం సరికాదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మైనార్టీలపై ఎన్నో దాడులు జరిగాయన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత దైవ సేవ చేస్తున్న పాస్టర్లు, అర్చకులు, మౌల్వీలకు గౌరవ వేతనం ఇస్తున్నారని గుర్తు చేశారు. క్రిష్టియన్ మైనార్టీలపై ఇంత ప్రేమాభిమానాలు చూపిస్తున్న జగన్నకు వారు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్ కిషోర్, పాస్టర్లు షడ్రక్ రాజు, పీడీకే దాస్, ప్రేమానందం, జానయ్య, సుధీర్, శ్రీనివాసులు డేవిడ్ రాజ్, వినోద్, సజ్జన్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



పాత్రికేయులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి : ప్రజాస్వామ్యంలో ఎన్నికల సమగ్రత, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపరచడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఎన్నికల్లో మీడియా పోషించాల్సిన పాత్రపై విలేకరులకు డీసీసీ బ్యాంక్ డీఆర్‌ఓఎస్‌డీ గుర్రప్ప పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కుతో సరైన నాయకుడిని ఎన్నుకునేలా ఓటర్లకు సహాయపడాలని తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయడానికి మీడియా సహకరించాలన్నారు. ఎన్నికల్లో వాస్తవ విషయాల కంటే అసత్యమైన విషయాలే త్వరగా వ్యాప్తి చెందుతాయన్నారు. కావున ఫేక్ న్యూస్ కాకుండా సత్యమైన, వాస్తవిక దృష్టితో వార్తలు ప్రసారం అయ్యేలా మీడియా ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అధికారిక సమాచారాన్ని ఐఅండ్‌పీ ద్వారా తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి, భరత్ కుమార్ రెడ్డి, డీపీఆర్‌ఓ పురుషోత్తం, ధర్మానాయక్, జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మీ, విలేకరులు పాల్గొన్నారు.

మహిళా.. వందనం



ఏఎఫ్‌యూ : వైవీయూ డీన్ ఆచార్య పి. పద్మను సత్కరిస్తున్న ఏఎఫ్‌యూ మహిళా అధ్యాపకులు



కడప కార్పొరేషన్: అక్కాయపల్లె స్త్రీ శక్తి భవన్ వద్ద మహిళా దినోత్సవ వేడుకలు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ముందస్తు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైవీయూ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పుత్తా పద్మా, పాలకమండలి సభ్యురాలు ఆచార్య పి. చంద్రమతీ శంకర్, సైకాలజీ విభాగాధిపతి డా. కె. లలితలు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారిని విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. ఇ.సి. సుప్రియ, శాంతి, తులసి పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్ : స్థానిక విద్యుత్ భవన్ సమావేశ మందిరంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎస్. రమణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. విద్యుత్ సంస్థలో ప్రతిభ చూపిన మహిళా ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

అక్కాయపల్లెలో..

కడప నగరంలోని అక్కాయపల్లె మహిళా శక్తి భవన్‌లో జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెప్మా పీడీ వై. సురేష్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మిలు ముఖ్య అతిథులుగా హాజరై మహిళా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.

కడప కోటిరెడ్డి సర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ కార్యాలయ సమావేశ భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథులుగా ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధారాణి విచ్చేసి మాట్లాడారు. అనంతరం జోనల్, జిల్లా స్థాయిలో వివిధ హోదాలలో పనిచేస్తూ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులను సత్కరించారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..

జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం మహిళాదినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ విచ్చేసి మాట్లాడారు. రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ గజ్జల లక్ష్మి, మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రోహిణి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి మాట్లాడారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన ఉత్తమ ప్రతిభ కనబరచిన మహిళా ఉద్యోగులను సత్కరించారు.

చట్టాల పట్ల అవగాహన ఉండాలి

కడప కల్చరల్ : మహిళల రక్షణకు అవసరమైన ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటి గురించి తెలుసుకుని అవగాహన కలిగిఉండాలని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తెలిపారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, డాక్టర్ సలీంబాష ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, ఆచార్య ఎన్. ఈశ్వర్‌రెడ్డి, వైద్యులు శశికళ, ఇంటాక్ కన్వీనర్ చిన్నపరెడ్డి, డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, చిన్న కళావతి తదితరులు మాట్లాడారు. అధ్యాపకులు, సిబ్బంది అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు కొండూరు జనార్దన్‌రాజు, కొండారెడ్డి, భారవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ తెలిపారు. గురువారం కడపలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం, జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవ సమితి సంయుక్త ఆధ్వర్యంలో నారిశక్తి ఫిట్నెస్, నారిశక్తి వాలీబాల్, నారిశక్తి ఖోఖో టోర్నమెంట్స్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ జ్యోతి, జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవ సమితి వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడారు.

కడప ఎడ్యుకేషన్ : నగరంలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా డీసీసీ బ్యాంకు సీఈఓ కె. రాజేంద్రకుమార్ హాజరై వివిధ రంగాల మహిళా ప్రముఖులను సత్కరించారు. జనరల్ మేనేజర్ రోజామణి, గీతం కళాశాల ప్రిన్సిపాల్ పంపావతి, పర్వీన్ నాజ్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ ఆధ్వర్యంలో..

కడప నగరంలోని చెమ్ముమియాపేట బాలికోన్నత పాఠశాలలో ఎస్‌టీయూ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం మేరీ, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందిని సన్మానించారు.

మహిళలు ముందడుగు వేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : సమాచార పౌర సంబంధాల శాఖ ఏడీ పి.వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కడప కలెక్టరేట్ లోని జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ జరిగింది. అనంతరం మహిళా ఉద్యోగులందరూ సాధికారతకు సంఘీభావం వ్యక్తం చేస్తూ కలిసికట్టుగా కేకును కత్తిరించారు.

కడప కల్చరల్ : ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో కళాశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యులు విజయలక్ష్మి, శచీదేవిలను సత్కరించారు.



కడప కోటిరెడ్డి సర్కిల్: ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది



కడప కోటిరెడ్డి సర్కిల్: ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులతో ఈడీ



కడప కల్చరల్: మహిళలను సత్కరిస్తున్న మానవత సంస్థ సభ్యులు



కడప సెవెన్‌రోడ్స్ : కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగినిలు



కడప ఎడ్యుకేషన్ : డీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది



కడప కల్చరల్ : మహిళామణులను సత్కరిస్తున్న ఇంటాక్ సంస్థ ప్రతినిధులు

కేఎల్ఆర్ మార్ట్ ప్రారంభం



త్రివేణీస్ కేఎల్ఆర్ మార్ట్‌ను ప్రారంభిస్తున్న కడప మేయర్ కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరం చౌటపల్లె రోడ్డులోని తిలక్ నగర్‌లో అరవిందం అపార్ట్‌మెంట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన త్రివేణీస్ కేఎల్ఆర్ మార్ట్‌ను కడప మేయర్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ మార్కెట్ రంగంలో అనుభవం ఉన్న గౌతమ్ కుమార్ ఈ మార్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆయన మార్ట్ ద్వారా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

రైతు శ్రేయస్సుకు పాటుపడాలి



డీలర్లకు సర్టిఫికెట్లను అందచేస్తున్న అడిషినల్ ఎస్పీ లోసారి సుధాకర్

కడప అగ్రికల్చర్ : రైతు శ్రేయస్సుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పాటుపడాలని జిల్లా అడిషినల్ ఎస్పీ లోసారి సుధాకర్ అన్నారు. గురువారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఏడాదిపాటు డిప్లమా కోర్సు పూర్తి చేసుకున్న ఇన్పుట్ డీలర్లకు సర్టిఫికెట్ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు, ఆత్మ పీడీ విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, శ్రీవల్లి, బాగమతి, ప్రియ, కృష్ణప్రియ రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు


'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : నవరత్నాల పథకాల అమలుతో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 38వ డివిజన్ అల్మాస్‌పేట, మద్దే ఖాన్‌మసీదు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభు త్వం అమలు చేస్తున్న పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో కూడిన బుక్ లెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య, దాసరి శివ, ఎన్. సుబ్బారెడ్డి, పవర్ అల్తాఫ్, ఏటుజెడ్ సొహైల్, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని అభిమానించేవారు టీడీపీ జెండా పట్టుకోరు


పార్టీలో చేరిన అన్వర్‌బాషాకు కండువా వేసి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అభిమానించే వారు ఎవరూ టీడీపీ జెండా పట్టుకోరని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. గురువారం స్థానిక 38వ డివిజన్‌లోని అల్మాస్ పేటలో అన్వర్ బాషాకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందని, ప్రతి ఒక్కరూ సంతృప్తిగా ఉన్నారన్నారు. అసత్యాలు, పొత్తులను నమ్ముకొని టీడీపీ రాజకీయాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, పవర్ అల్తాఫ్,షఫీవుల్లా, రామ్మోహన్‌రెడ్డి, జఫ్రుల్లా, ఆయుబ్, మధు, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మాపై అసత్య కథనాలు రాయడం దారుణం

ఖండించిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, పార్టీ మారబోతున్నారని ఒక దినపత్రికలో కథనం రాయడం దారుణమని కార్పొరేటర్లు ఎస్‌ఏ షంషీర్, ఆర్. చెన్నయ్య, డివిజన్ ఇన్‌చార్జులు శ్రీరంజన్‌రెడ్డి, లక్ష్మయ్య, సుదర్శన్‌రెడ్డి, ఏ. బాలక్రిష్ణారెడ్డి, నాగమల్లారెడ్డి అన్నారు. గురువారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేశారని, ఫలితంగా ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. దీన్నుంచి ప్రజల దృష్టికి మరల్చేందుకు ఎల్లోమీడియా అసత్య కథనాలు వండి వారుస్తోందన్నారు. కడప నగరంలో 20 మంది కార్పొరేటర్లు పార్టీ మారబోతున్నారని కథనం రాయడం అన్యాయమన్నారు. ఏ కార్పొరేటర్లు, ఇన్‌చార్జులలో కూడా అసంతృప్తి లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏ1 నాగరాజు, దత్త సాయి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం సందర్శన


బృంద వృద్ధాశ్రమంలో వైవీయూ వీసీ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైవీయూలోని వాణిజ్య శాఖ అధ్యాపకులు విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు మానవతా విలువలను అలవాటు చేస్తున్నారు. పదేళ్లుగా వారు ఒక సహాయ నిధిని ఏర్పాటు చేశారు. ప్రతి వారం విద్యార్థులు, అధ్యాపకులు తమ వంతుగా ఈ సహాయ నిధికి కొంత మొత్తాన్ని జమ చేస్తున్నారు. ఈ నిధి నుండి కడప పరిధిలోని వివిధ ఆశ్రమాలకు కొంత మొత్తాన్ని వినియోగించి తమ వంతు సహాయాన్ని అందిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం వాణిజ్య శాఖ వారు కడపలోని బృంద వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడి వృద్ధులతో మాట్లాడి వారి మేమున్నామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, ప్రధానాచార్యులు రఘునాథ రెడ్డి, వాణిజ్య శాఖ విభాగాధిపతి విజయ భారతి, ఆచార్య చంద్రమతి శంకర్, సహాయక ఆచార్యులు హరినాథ్, ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజం పట్ల బాధ్యత అవసరం

వైవీయూ : చదువుతో పాటు విద్యార్థులు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-7 ఆధ్వర్యంలో వారంరోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక క్యాంపు ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-7 ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. లలిత, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ డా. ఎస్. సునీత, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలు


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ రోజువారీ కార్యక్రమాలు మొదలు మహిళలు లేని రంగం అంటూ ఏదీ లేదన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం వైద్యురాలు డా. సి. విజయకుమారి, భారతి, శివపార్వతి, డా. కల్పన, రాజేశ్వరి, సావిత్రి, అనిత, కృష్ణవేణి, రాధిక, రేణుక మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ డా. ఎ. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.